క్లుప్తంగా

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: మండల పరిధిలోని దిగువ గంగంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్‌నాయకుడు నాగభూషణరెడ్డి కుమార్తె నవ్యసాయి వివాహం చంద్రకాంత్‌రెడ్డితో జరిగింది. బుధవారం స్థానిక రంగమహల్ ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
పరిగి: మండలంలోని విట్టాపల్లిలో జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తలారి రామాంజి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాంజి కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు.

రోడ్లపైకి యథేచ్ఛగా పశువులు



రోడ్డుపై నిలచి ఉన్న పశువులు

పెనుకొండ: పట్టణంలోని ప్రధాన రహదారులపై యథేచ్ఛగా పశువులు సంచరిస్తున్నాయి. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో వాహనదారులు కాళ్లు , చేతులు విరిగి ఆస్పత్రుల పాలయ్యాయి. ఇక.. వారపు సంతలో పశువుల బెడద తట్టుకోలేక మహిళలు, చిన్నారులు, వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్దే రోడ్డు మధ్యలో పశువులు ఎక్కువ సంఖ్యలో నిలిచి ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. పశువుల యజమానులు పట్టించుకోకపోవడం, సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారాయన్న విమర్శలున్నాయి.

చోరీ ఘటనపై దర్యాప్తు

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యం తండా సమీపంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప ఇంట్లో గత నెల 31న రాత్రి రూ.8 లక్షలు విలువ గల బంగారు ఆభరణాలు చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై తిమ్మప్ప రొళ్ల పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. చోరీ జరిగిన రోజు ఇంటి వరండాలో నిద్రించిన సన్నిహితుడికి సంబంధించిన ద్విచక్ర వాహనం తాళాలు ఇంటి లోపల పడి ఉండటంతో సదరు వ్యక్తిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులు ఆ దిశగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే బుధవారం క్లూస్‌టీం పోలీస్ బృందం తిమ్మప్ప ఇంట్లో వేలిముద్రలను సేకరించారు.

విగ్రహ ప్రతిష్టకు రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న రాజు

అమరాపురం: మండల కేంద్రంలో నాడప్రభు కెంపేగౌడ విగ్రహ ప్రతిష్టాపనకు బీబీఎంపీ కమిషనర్, చిత్రదుర్గ జిల్లా వక్కలిగ సంఘం డైరెక్టర్ జే.రాజు రూ.లక్ష చెక్కును కెంపేగౌడ యువక సంఘానికి బుధవారం అందించారు. రాజు మాట్లాడుతూ.. కుంచిటి వక్కలిగుల అభివృద్ధికి పాటు పడిన కెంపేగౌడ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మంజునాథ, నాగభూషణ, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా జయవర్ధన్‌రెడ్డి



చిలమత్తూరు: ట్రాన్స్‌కో మండల ఏఈగా జయవర్ధన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు.

పినాకిని నదికి జలకళ



పావగడ: కర్ణాటక పైభాగంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో నాగలమడకలోని ఉత్తర పినాకిని నది జలకళను సంతరించుకుంది. రెండు రోజులుగా నాగలమడక తాగు నీటి ప్రాజెక్ట్ పూర్తిగా నిండటంతో నీరు పేరూరు మిడ్ పెన్నార్ డ్యాం వైపు వెళ్తోంది. జయమంగళి నది నీరు నాగలమడక ఉత్తర పినాకిని నదిలోకి చేరుకోవడం ఇదే మొదటిసారి అని స్థానికులు చెబుతున్నారు.

హర హర మహాదేవ

- భక్తులను ఆకట్టుకుంటున్న పెనుకొండలోని శివాలయాలు
- కార్తీక మాస వేళ శివమాలధారణలతో పెద్ద ఎత్తున దర్శనాలు
- ప్రత్యేక ఆకర్షణగా ధ్యాన ముద్ర శివుడు



పెనుకొండలోని ధ్యాన ముద్ర శివుడు

పెనుకొండ: రాజరికపు చరిత్రకు పెనుకొండ పట్టుగొమ్మ. అనేక మంది రాజులు పెనుకొండలో తమ పాలన సాగించారు. ముఖ్యంగా విజయనగర రాజులు పెనుకొండలో శివాలయాలను నిర్మించి స్వామిపై తమకున్న భక్తిని చాటుకున్నారు. ఇందులో భాగంగా కాశీ విశ్వేశ్వరాలయం, ఐముక్తేశ్వరాలయం , నగరేశ్వరాలయం, భోగలింగేశ్వరాలయం, దుద్దేబండ సమీపంలోని శ్రీకైలాసక్షేత్రం, కోనలోని కోన మల్లికార్జునస్వామి ఆలయాలు ప్రముఖ క్షేత్రాలుగా ఇక్కడ విరాజిల్లుతున్నాయి.

ఐముక్తేశ్వరాలయం

ఐముక్తేశ్వరాలయానికి ఎంతో విశిష్టత ఉంది. విజయనగర రాజుల చక్రవర్తి అయిన మల్లికార్జునరాయలు పెనుకొండలో కోటగోడ నిర్మించే సమయంలో కోటగోడ రాళ్లు పదేపదే పడిపోతుండడంతో కోటగోడ ఎలా నిర్మించాలన్న ఆందోళన మొదలైంది. ఈ సందర్భంగా వేదపండితులు ఇచ్చిన సలహాతో భక్తిశ్రద్ధలతో ఐ ఆకారంతో ఐముక్తేశ్వరాలయాన్ని నిర్మించారు. ఆ తర్వాత కోటగోడ పనులు ఏ ఆటంకం లేకుండా కొనసాగాయని చరిత్ర చెబుతోంది.



పెనుకొండలోని నగరేశ్వరాలయం

నగరేశ్వరాలయం

పట్టణంలో ప్రసిద్ధి చెందిన మరో ఆలయం నగరేశ్వరాలయం. ఇది ఎంతో పురాతన ఆలయం. శిథిలావస్థలో ఉన్నా ఎంతో మహిమాన్వితమైన ఆలయమని అర్చకులు చెబుతున్నారు. కార్తీక మాస వేళ భక్తులు పెద్దఎత్తున ఈ ఆలయాన్ని దర్శించుకుంటుంటారు. ఆలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు గత కొంత కాలంగా ఎంతో సహకారం అందిస్తున్నారు. ఆలయ ఆవరణంలో కళ్యాణ మండపం సైతం నిర్మిస్తున్నారు.

శ్రీకైలాస క్షేత్రం

దుద్దేబండ సమీపంలోని శ్రీకైలాస క్షేత్రాన్ని కూడా భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటుంటారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ పలుమార్లు ఈ క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా అటవీ ప్రాంతంలో ఉన్న ఈ ఆలయానికి తారు రోడ్డు వేయించారు. ఇక్కడ భృగు మహర్షి గంగా జలం కోసం ఒంటి కాలిపై శివుడిని స్తుతిస్తూ ధ్యానం చేసినట్లు చరిత్ర చెబుతోంది. అలాగే పెనుకొండ మండలంలోని కోన మల్లికార్జునస్వామి ఆలయం కూడా ఎంతో మహిమాన్వితమైన దేవాలయంగా విరాజిల్లుతోంది.

ఆకట్టుకుంటున్న ధ్యానముద్ర శివుడు

పెనుకొండలో కొన్నేళ్ల భోగసముద్రం జలవన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్యాన ముద్ర శివుని విగ్రహం ప్రజలను, పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటోంది. రోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు, భక్తులు, పర్యాటకులు ఇక్కడికి చేరుకుని ఆనందపరవశం చెందుతుంటారు. వివిధ ప్రాంతాల నుంచి శివమాలధారణ వేసిన భక్తులు ప్రత్యేకంగా ఇక్కడ ధ్యాన ముద్రుని ఆకారంలో ఉన్న పరమ శివుడిని చూసి తరించిపోతుంటారు. పెనుకొండ కొండ కింది భాగంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో ప్రకృతి అందాలు కూడా ఆకట్టుకుంటున్నాయి.

కాశీ విశ్వేశ్వరాలయం



పెనుకొండలోని పవిత్ర కాశీ విశ్వేశ్వరాలయం

పెనుకొండలో కాశీ విశ్వేశ్వరాలయం కాశీలో శివలింగాన్ని పోలి ఉంటుంది. ఇక్కడి ఆలయంలో శివలింగాన్ని దర్శించుకుంటే కాశీకి పోయినంత పుణ్యం లభిస్తుందన్నది భక్తుల నమ్మకం. ఈ ఆలయాన్ని విజయనగర రాజులు ఎంతో అద్భుతంగా నిర్మించారు. ఆలయ కట్టడాలపై విజయనగర రాజుల వంశ గుర్తులు ఉంటడం విశేషం. ఈ ఆలయాన్ని స్థానిక భక్త బృందం నేడు ఎంతో అభివృద్ధి చేస్తోంది.

భోగలింగేశ్వరాలయం



పెనుకొండలోని భోగేశ్వరాలయం

పట్టణంలోని భోగసముద్రం కట్ట పైభాగంలో భోగలింగేశ్వరాలయం నిర్మించారు. రోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఎంతో పురాతన చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఎప్పుడు ఇక్కడ పాలించిన రాజులు ప్రత్యేక పూజలు చేసేవారట. వేలాది మంది భక్తులు చెరువు వద్దకు చేరుకుని నాటి రాజరికపు చరిత్రను తలుచుకుని హర్షం వ్యక్తం చేస్తుంటారు.

కార్తీకం ఎంతో పవిత్రం



కార్తీకమాసం ఎంతో పవిత్రమైనది. ఈ మాసంలో శివుడి మాల ధరించి ఆయనపై భక్తి ప్రపత్తులతో నియమాలు ఆచరిస్తే జీవితానికి సార్థకత లభిస్తుంది. ముఖ్యంగా పెనుకొండ ప్రాంతంలో ఎంతో చరిత్ర ఉన్న శివాలయాలు ఉన్నాయి. భక్తులు పెద్ద ఎత్తున వాటిని దర్శించుకుంటూ శివయ్య కృపకు పాత్రులవుతుంటారు. – వెంకటేసులు, శివమాలధారణ భక్తుడు, పెనుకొండ

భూతప్పస్వామికి ప్రత్యేక పూజలు



భూతప్ప ఆలయాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: కర్ణాటక రాష్ట్రం శిర తాలూకా పురలహళ్లి భూతప్పస్వామిని బుధవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప దర్శించుకున్నారు. తొలుత స్వామివారికి విశేష పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట జిల్లా సంయుక్త కార్యదర్శి జీబీ శివకుమార్, సర్పంచులు తిప్పేస్వామి, అశ్వత్, మాజీ సర్పంచ్ రామిరెడ్డి ఉన్నారు.

శుభకార్యం

రొళ్ల: మండల పరిధిలోని హులికుంటకు చెందిన డాక్టర్ మల్లేష్ కుమారుడు అజయ్‌కుమార్, రుచిత వివాహ వేడుక శిర పట్టణంలోని బైలాంజనేయ స్వామి కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నీటి సరఫరాలో ఇబ్బంది రానివ్వొద్దు



మోటర్లను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

హిందూపురం: గొల్లపల్లిలో మున్సిపల్ పంపింగ్ మోటర్ల పనితీరును మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. మోటార్లు సజావుగా నడిచేందుకు ప్యానెల్ బోర్డును సక్రమంగా నిర్వహించాలని, ఏవైనా మరమ్మతులుంటే సత్వరం పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణానికి నీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీఈఈ బాలసుబ్రహ్మణ్యం, ఏఈ జనార్దన ఉన్నారు.

నిరుపేదల అభివృద్ధే ఆర్డీటీ ధ్యేయం



ఇళ్లను ప్రారంభిస్తున్న స్పెయిన్ బృందం

గుడిబండ: గ్రామీణా ప్రాంతాల్లోని నిరుపేద అభివృద్ధే ఆర్డీటీ ధ్యేయమని సంస్థ చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేజీఎన్ పాళ్యంలో ఆర్డీటీ ద్వారా నిర్మించిన 29 నూతన ఇళ్లను స్పెయిన్ బృందం సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏటీఎల్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రాఘవేంద్ర (ఫైల్)

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నక్కలగుట్ట కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు నీరుగంటి రాఘవేంద్ర (40) బుధవారం అదృశ్యమయ్యాడు. ఆయన భార్య నాగమణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండి



మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్

హిందూపురం అర్బన్: ఫ్యాక్టరీల్లో పనిచేసే మహిళల భద్రతకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఫ్యాక్టరీల యజమానులు, ప్రతినిధులకు హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్, అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు సూచించారు. బుధవారం తూమకుంట , గోళ్లాపురం పారిశ్రామిక వాడల్లోని పారిశ్రామిక యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఇక్కడున్న పరిశ్రమల్లో వందలాది మంది మహిళలు పనిచేస్తున్నారని, కర్మాగారాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా ఉపేక్షించేది లేదన్నారు.

శ్మశానానికి దారేదీ?



పొలాల మధ్య నుంచే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని కొత్తచామలపల్లిలో శ్మశానానికి వెళ్లేందుకు దారిలేక ఎస్సీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఓ వృద్ధురాలు చనిపోవడంతో ఆమె మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి దారిలేక పొలాల గుండా తీసుకువెళ్లాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఎన్నోసార్లు అధికారుల వద్ద విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. రైతుల వద్ద నుంచి భూమి కొనుగోలు చేసి దారి చూపించాలని వేడుకుంటున్నారు.

సంక్షిప్త సమాచారం

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ



మందులు పరిశీలిస్తున్న మంజువాణి

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారిణి మంజువాణి తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలపై అక్కడున్న రోగులతో ఆరాతీశారు.

న్యాయవాదిపై పోలీసుల దాడి హేయం

పావగడ: ఉన్నత న్యాయాలయంలో ఓ కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినా వినకుండా తుమకూరు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు నాయవాది రవికుమార్ పై తుమకూరు రూరల్ సీఐ దినేశ్‌కుమార్ దాడి చేయడం హేయమని జేఎంఎఫ్‌సీ న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంఘటనకు నిరసనగా బుధవారం వారు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తాలూకా కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రమిచ్చారు.

మెను ప్రకారం భోజనం వడ్డించాలి

రొళ్ల: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దొడ్డేరి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. తర్వాత భోజన నాణ్యతను పరిశీలించారు.

వాహన తనిఖీలు

అగళి: మండల కేంద్రంలోని మడకశిర రోడ్డు వద్ద బుధవారం ఎస్‌ఐ వీరేష్ సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమతిలేని, నంబర్ ప్లేట్లు లేని వాహనదారులకు ఫైన్ విధించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



కల్లుమర్రిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆరోగ్య, పోషణ, వ్యాధి నిరోధిక టీకాల ప్రాముఖ్యత, చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య, పోషణ నిపుణులు సాయి నాగిరెడ్డి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పౌష్టిహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థులకు లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొళ్ల: సమాజంలో బాల, బాలికలు ఉత్తమ పౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులు బాలికలకు బాల్య వివాహాలను చేయకుండా అరికట్టాలని ఎంఈఓ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, ఆర్డీటీ టీం లీడర్, చైల్డ్ కోఆర్డినేటర్ ఆదినారాయణ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కాకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీటీ, ఐసీడీఎస్‌శాఖ సంయుక్తంగా కలిసి బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా బాల, బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అటవీ ప్రాంతంలో మంటలు



ఎగిసిపడుతున్న మంటలు

పెనుకొండ: పట్టణ సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం మంటలు ఎగిసిపడ్డాయి. స్థానిక సాకిరేవు సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తులు ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలు వేశారు. బుధవారం మధ్యాహ్నం ఉన్న ఫళంగా మంటలు ఎగిసి పడటంతో పెద్ద పచ్చని చెట్లకు భారీగా మంటలు వ్యాపించాయి. దీంతో మంటలు అటవీ ప్రాంతం వైపు వెళ్లాయి. స్థానికులు అటవీశాఖ అధికారులు, ఫైర్ అధికారి మల్లికార్జున రెడ్డికి సమాచారం అందించారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

పెనుకొండ రూరల్: పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని రెవిన్యూ గ్రామాల్లో ఈ నెల 8 తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీదారులు ఆధార్, సెల్ నంబర్లను అర్జీలకు జతపరిచి ఇవ్వాలన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణకు తరలిరండి



సమావేశమైన వడ్డెర సంఘం నాయకులు

మడకశిర: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 10న కదిరిలో జరుగుతుందని వడ్డెర సంఘం నాయకులు బాబు, రఘురామ్, నాగరాజు, సుబ్బరాయుడు, దేవరాజు, రామచంద్ర, అంజమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో వారు సమావేశమయ్యారు. ఇందులో భాగంగానే విగ్రహావిష్కరణపై చర్చించారు. నియోజకవర్గంలోని వడ్డెర్లు విగ్రహావిష్కరణకు తరలిరావాలని కోరారు.

ఫ్యాన్లు, సీసీ కెమెరాల వితరణ

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనం అభివృద్ధిలో భాగంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు మేడికుర్తి హరి సీసీ కెమెరాలను, వాల్ ఫ్యాన్లను ప్రెస్ క్లబ్‌కు అందించారు. ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులకు బుధవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో పేట వేంకటరమణ స్వామి

వేంకటరమణ గోవిందా.. గోవింద !



ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించిన దృశ్యం

హిందూపురం: పేట వేంకటరమణస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. సాయంత్రం ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించి విశేష పూజలు చేశారు. ఈఓ నరసింహమూర్తి, అర్చకులు కృష్ణమూర్తి, చరణ్, భక్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పెనుకొండ: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వైస్ ప్రిన్సిపల్ జయప్ప ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో అధ్యాపకులు యశోదారాణి, హరిప్రసాద్, రామన్న, హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బసవనపల్లిలో 'పొలం పిలుస్తోంది'

లేపాక్షి: మండలంలోని బసవనపల్లి, మైదుగోళం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ సనావుల్లా కంది, వరి, మొక్కజొన్న పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు.

కెంచమాంబదేవికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకంట గ్రామంలో వెలసిన కెంచమాంబదేవి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం బంగారు పాళ్యం గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని యాజమానులు, అర్చకులు భక్తులు ఊరేగించారు. అనంతరం యాజమాని ఇంటిలో కూర్చొబెట్టి ప్రత్యేకంగా పూజలు చేశారు.